

# దూరంగా సారంగధర

సాయంత్రం ఆరున్నరకే వీధి అరుగులమీదకి చిమ్నీ బుడ్లతో, లాంతర్లతో వచ్చేశారు పిల్లలు.

పరీక్షలు దగ్గరకొస్తున్నాయి.

పుస్తకాలు తెరిచారేమో! గున గున గున చదువులు. ఆపకుండా తలెత్తకుండా కంఠోపాఠాలు. వీధి చివరనుంచుంటే దీపాల బారులు, వాటి ముందు పిల్లలచదువుల హోరు.

కామయ్య గారింట్లో ప్రైవేటు కుదురుకున్న పాతిక మందిపిల్లలు అప్పుడే వచ్చి దీపాలు వెలిగించుకుని వరండాలో సర్దుకున్నారు. కామయ్య గారు ఏ బడిలోను మాష్టరు కాదు. కాని యాభై అయిదో ఏట రెండోపెళ్ళి చేసుకోటాన సంపాదన నిమిత్తం ఈ ప్రైవేట్లు పెట్టుకున్నాడు. పాఠం గట్టిగా చెప్తాడని, బెత్తాలు బాగా విరగటం మూలాన పిల్లలకి భయం ఉంటుందని చాలామంది తమ పిల్లల్ని కామయ్య దగ్గరకి పంపిస్తున్నారు. ఎనిమిదిగంటలకి భార్య లక్ష్మమ్మ వండిన వేడి పప్పుచారుతో కమ్మగా భోజనం చేసి త్రేన్చుకుంటూ నులకమంచం మీదికొచ్చాడు కామయ్య. అప్పటికే పిల్లలు జోగుతున్నారు. "ఒరేయ్!" అని పిల్లల్ని బెత్తంతో అదిలిస్తే ఉలిక్కిపడి మళ్ళీ గొంతులెత్తి చదువుతున్నారు.

మరో పదినిమిషాలకి లక్ష్మమ్మ ఇల్లు సర్దుకుని తాంబూలం నములుతూ వస్తే అప్పటికి భర్త గురకపెడుతున్నాడు. భర్త లేనప్పుడు లక్ష్మమ్మ పిల్లల్ని చదివిస్తుంది. కొందరు నిద్రకు తూలుతూ ముందుకు వాలితే చిమ్నీసెగకి వెంట్రుకలంటుకుని

'చిటచిట' కాలాయి. వెధవ్వాసన. 'తలకాయలు తగలెట్టుకోకండ్రా, వెధవల్లారా' కేకలేసింది లక్ష్మమ్మ. అందరిలోకి నారాయణంటే లక్ష్మమ్మ ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంది. నారాయణకి పదమూడేళ్ళు. 'బాగా చదువుతున్నావా?' అంటూ కళ్ళలోకళ్ళు పెట్టి చూస్తుంది. నారాయణకేం చెప్పాలో తెలియక 'చదువుతున్నానండీ' అంటాడు బెంబేలు పడుతూ ..... .....

ఇంతలో మంచినీళ్ళ వేళవచ్చింది. ఇంతమందికీ మంచినీళ్ళంటే రెండు బిందెలనీళ్ళవుతాయి. కనుక, అందరూ లాంతర్లేసుకుని కృష్ణకి పోవలసిందే. అది పిల్లలకి ఆటవిడుపులా ఉంటుంది. అందరూ బయలుదేరుతుంటే లక్ష్మమ్మ నారాయణని ఆపి 'చీకట్లో పురుగూ పుట్రా ఉంటుంది. నీకు మంచినీళ్ళు నేనిస్తాలే' అని చెయ్యి పట్టుకు ఆపి గ్లాసెడు నీళ్ళిచ్చింది. నారాయణకి పిల్లల్తో వెళ్ళాలని సరదా. ఆ గ్లాసుడు నీళ్ళుతాగి 'ఇప్పుడే వస్తా' అని పరుగున వచ్చి పిల్లల్ని కలుసుకున్నాడు.

వీళ్ళతోపాటు వీధిలోని పిల్లలు కూడా చేరారు. దీపోత్సవం కృష్ణకు బయలుదేరినట్టు దీపాలు, పిల్లల కేరింతలు. కృష్ణలో దోసిళ్ళకొద్ది నీళ్ళు తాగారు. నీళ్ళు ఒకళ్ళమీద ఒకళ్ళు చిమ్ముకున్నారు. పాటలు పాడారు. ఆటలు ఆడారు. కేరింతలు కొట్టుకుంటూ తిరిగొచ్చి దీపాలముందు కూర్చుని పుస్తకాలు విప్పారు. అరగంట గడిచిందో లేదో ఆవులింతలు. తొమ్మిదయింది పడుకోండి అనగానే దీపాలార్పేసి పక్కలు పరిచారు పిల్లలు. నారాయణ పక్క తన మంచం పక్కనే వేసుకోమంది లక్ష్మమ్మ. పక్క వేసుకున్నట్టే వేసుకున్నాడుగాని నారాయణకెందుకో భయమేసి పక్క వొదిలేసి మిగతావాళ్ళ పక్కలో దూరి సొమ్మసిల్లి నిద్రపోయాడు.

తెల్లవారు జామున నాలుగింటికి గంటకొట్టినట్లు లేచాడు కామయ్య పిల్లలందర్నీ నిద్ర లేపాడు. మేష్టారి అరుపులకి నిద్ర వొదిలిపోగా, దీపాలు వెలిగించారు. మళ్ళీ గున గున చదువులు సాగాయి.

దూరంగా 'సారంగధర' వీధిభాగవతం వినిపిస్తోంది. ఆఖరి రంగం జరుగుతూ వుండాలి. ''పిల్లల్ని చదివిస్తూ వుండవే'' అంటూ కామయ్య చెప్పులు వేసుకుని కన్రపుచ్చుకుని వీధినాటకానికి వెళ్ళాడు. దూరంగా ''నన్ను వొదిలిపోకురా!

సారంగా!నా రంగా!" అంటూ చిత్రాంగి పాట విన్పిస్తోంది.

లక్ష్మమ్మ జోగుతున్న పిల్లల్ని అదిలిస్తూ నారాయణ దగ్గరకొచ్చి కూర్చుంది. దగ్గరగా కూర్చుని "బాగా చదువుతున్నావా?" అంది. భయం భయంగా తలూపాడు నారాయణ. మీద చెయ్యేసి "రేపుమధ్యాహ్నం రా - కాజాలు పెడ్తా" అంది.

సరే అన్నట్టు తలూపాడు.

మీద వేసిన చెయ్యి బరువుగా ఉంది నారాయణకి. లక్ష్మమ్మ నారాయణ వీపు మీంచి చెయ్యి తియ్యలేదు. నారాయణకి మనసు పాఠంలోకి పోవటం లేదు. ఇంతలో తెల తెల వారటంతో కామయ్య వచ్చేశాడు. వచ్చీరాగానే కాళ్ళు కడుక్కొని పిల్లల్ని తలా నాలుగు ప్రశ్నలు వేసి పంపించేశాడు.

నారాయణ ఇంటికొచ్చి ముఖం కడుక్కుంటున్నాడేగాని, మనసంతా చికాగ్గా ఉంది. పంతులమ్మగారు తనవైపు చూస్తున్నప్పుడల్లా తనకు ఎక్కడలేని సిగ్గు. చెయ్యిపట్టుకు పలకరిస్తే భయం. ఆ భయం అలాగే ఉండిపోయింది. వంటింట్లోకి వచ్చి చద్ది తింటుంటే నారాయణ మేనమామ నలుగురు పెద్దలతో పక్కవూరునుంచి హుటా హుటిన బయలుదేరి వచ్చాడు. ఉభయకుశలోపరి అయిం తర్వాత తాపీగా మంచాలమీద కూర్చుని వచ్చిన విషయం చెప్పాడు. 'నారాయణకి మా అమ్మాయిని ఇవ్వటం వాళ్ళు పుట్టినప్పటినించీ అనుకుంటున్నదే. మా అమ్మ పెద్దదయిపోయింది. ఇంక నాలుగేళ్ళకి చేసే పెళ్ళి ఇప్పుడే చేసేస్తే పోలా?" ముసలమ్మ కళ్ళతో చూస్తుంది.

నారాయణకి చద్ది మింగుడు పడలేదు.

"చిన్నవాడు, ఏం తొందరా?" తండ్రి సణుగుతున్నాడు.

"నాకు తొందరలేదు. ముసలాళ్ళ గురించీ ..... " అంటూ ఇంకా చెపుతున్నాడు మేనమామ. నారాయణకి ఉన్నట్టుండి ఏడుపొచ్చింది. ఎంత ఆపుకుందామన్నా ఆగలేదు. పక్కనే వెన్న తీస్తున్న తల్లిని ఎంగిలిచేత్తోనే కౌగలించుకుని" నాకు పెళ్ళొద్దే! నేను చదువుంటానే" అని బావురుమన్నాడు.

వాకిట్లో వీధి భాగవతం వాళ్ళు "నన్ను వొదిలీ పోకురా! సారంగా! నా రంగా" అంటూ చందాలకొచ్చారు.*